


EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
శనివారం
18-10-2025
పేజీలు: 02

# K-ర్యాంప్ మూవీ రివ్యూ

ఈ దీపావళి కానుకగా థియేటర్స్ లోకి రిలీజ్ కి వచ్చిన అవైటెడ్ చిత్రాల్లో సాలిడ్ ఎంటర్టైనర్ గా ప్రమోట్ చేస్తూ వచ్చిన చిత్రం కే ర్యాంప్ కూడా ఒకటి. యువ హీరో కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన ఈ చిత్రం ఎలా ఉందో సమీక్షలో చూద్దాం రండి. పెద్ద బిజినెస్ మెన్ అయినటువంటి కృష్ణ (సాయి కుమార్) కి ఒక చిల్లరగా తిరిగే మాస్ కొడుకే కుమార్ అబ్బవరం (కిరణ్ అబ్బవరం). తన కొడుకుకి ఎలాగో పెద్దగా చదువు అబ్బడం లేదని కేరళలో ఓ కాలేజ్ లో జాయిన్ చేయిస్తాడు. ఇక అక్కడ తనకి తొలి చూపు లోనే మెర్సీ జాన్ (యుక్తి తరేజా) నచ్చేస్తుంది. దీనితో లైఫ్ లాంగ్ ఆమెతో ఉంటానని ప్రామిస్ కూడా చేస్తాడు. కానీ అక్కడ నుంచే అసలు సమస్య స్టార్ట్ అవుతుంది. మెర్సీ కి ఉన్న ప్రాబ్లమ్ ఏంటి? దానివల్ల కుమార్ ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నాడు? చివరికి కుమార్ తన నాన్న విషయంలో తెలుసుకుంది ఏంటి? ఆమె సమస్యకి పరిష్కారం చూపించాడా లేదా అనేది తెలియాలి అంటే ఈ సినిమా చూసి తెలుసుకోవాలి. కిరణ్ అబ్బవరం కి ఉన్న స్ట్రాంగ్ జోన్ జానర్ లో ఎంటర్టైన్మెంట్ కూడా కూడా ఒకటి. కొంచెం డీసెంట్ లైన్ ఉన్నా కూడా మంచి కామెడీతో లాక్కొచ్చేస్తాడు. అలాంటి ఎంటర్టైనర్ నే ఇది కూడా అని చెప్పొచ్చు. మెయిన్ గా ఈ సినిమాలో సెకండాఫ్ కామెడీ బాగా వర్కౌట్ అయ్యింది. హీరోయిన్ పై వచ్చే సన్నివేశాలు వీటితో పాటుగా నటుడు నరేష్ పై కొన్ని హిలేరియోస్ కామెడీ ఎపిసోడ్స్ థియేటర్స్ లో ఆడియెన్స్ చేత నవ్వులు పూయిస్తాయి. అలాగే ఫస్టాఫ్ లో కూడా అక్కడక్కడా కామెడి సీన్ వర్క్ అవుతాయి. అంతేకాకుండా సెకండాఫ్ లో కామెడీతో పాటుగా ఎమోషనల్ మూమెంట్స్ కదిలిస్తాయి. ఇలా ఇక్కడ మాత్రం కామెడీ, ఎమోషనల్ పార్ట్ బ్యాలెన్స్డ్ గా వర్క్ అయ్యిందని చెప్పవచ్చు. అలానే లాస్ట్ లో ఇచ్చిన ఏఐ ఎండింగ్ కూడా మంచి ఫన్ గా అనిపిస్తుంది. ఇక యంగ్




హీరో కిరణ్ అబ్బవరం తన రోల్ లో సాలిడ్ పెర్ఫార్మన్స్ ని అందించాడు. అల్లరి చిల్లరగా తిరిగే కుర్రాడిలా మంచి నటన తను కనబరిచాడు. స్టార్టింగ్ నుంచి ఎండింగ్ వరకు కుమార్ అనే పాత్ర తాలూకా మూడ్ ని మైంటైన్ చేస్తూ అలరించాడు అని చెప్పవచ్చు. కొన్ని కొన్ని సీన్స్ కోసం ఇంట్రెస్టింగ్ స్టెప్పులు కూడా తీసుకోవడం నటుడుగా తనని ప్రూవ్ చేస్తుంది. ఇక హీరోయిన్ యుక్తి తరేజాకి ఈ సినిమాలో మంచి రోల్ దక్కింది అని చెప్పవచ్చు. ఒక డిజార్డర్ ఉన్న అమ్మాయిగా మంచి నటన ఆమె కనబరిచింది. అలానే గ్లామర్ కి గ్లామర్ మంచి కెమిస్ట్రీ ఇంకా రొమాంటిక్ సన్నివేశాల్లో ఆమె బాగా చేసింది. ఇక నటుడు నరేష్ రోల్ సినిమాలో మరో హైలైట్ అని చెప్పాలి. తనపై కామెడీ ట్రాక్స్ బాగున్నాయి. అలాగే ఎమోషనల్ పార్ట్ కూడా బాగుంది. ఇక తనతో పాటు సాయి కుమార్ కి డీసెంట్ రోల్ పడింది. తన పాత్ర తాలూకా ఇంపార్టెన్స్ బాగుంది. ఇక వీరితో పాటుగా కిరణ్ అబ్బవరంకి ఫ్రెండ్ గా కనిపించిన నటుడు, మురళీధర్ గౌడ్ తదితరులు తమ పాత్రల్లో మెప్పించారు. వెన్నెల కిషోర్ కూడా ఉన్న కొంచెం సేపు మంచి ఫన్ ఇచ్చి వెళ్లారు. ఈ సినిమాలో కొంచెం డిజప్పాయింట్ చేసే అంశం ఏది అంటే ఒకింత రొటీన్ గా సాగే ఫస్టాఫ్ అని చెప్పాలి. ఫస్టాఫ్ లో మరీ ఎక్కువ ఎంగేజ్ చేసే అంశాలు లేవు. ఓకే అక్కడక్కడా కామెడీ సీన్స్ పర్వాలేదు అనిపిస్తాయి కానీ కథనం అలా బిలో యావరేజ్ రేంజ్ లో అనిపిస్తుంది. అంతే కాకుండా అక్కడక్కడా కథనం రొటీన్ అండ్ ఊహాజనిత రీతిలోనే కొనసాగుతుంది. ఇంకా హీరోయిన్ రోల్ బాగానే ఉంది కానీ ఇంకొంచెం డీటైలింగ్ ని పాటించాల్సింది. కమెడియన్ అలీ, శ్రీనివాస్ రెడ్డి లాంటి నటులని ఇంకా బాగా వాడుకుంటే బాగుణ్ను. ఒక మూమెంట్ లో నరేష్ విషయంలో కూడా ఇలానే అనిపిస్తుంది. వీటితో పాటుగా పెదవి ముద్దు సన్నివేశాలు లాంటివి కొంచెం ఎక్కువయ్యాయి అనిపిస్తుంది. ఇవి ఓ సెక్షన్ ఆడియెన్స్ కి కొంచెం ఇబ్బందిగా




అనిపించవచ్చు. ఇక మొత్తంగా చూసుకున్నట్టైతే ఈ “కే ర్యాంప్” ఈ దీపావళికి అక్కడక్కడ నవ్వించే టైం పాస్ ఎంటర్టైనర్ అని చెప్పొచ్చు. ఒక రొటీన్ అండ్ ఫ్లాట్ ఫస్టాఫ్ తర్వాత సెకండాఫ్ కొంచెం రిలీఫ్ ఇస్తుంది. మంచి ఫన్ అలానే డీసెంట్ ఎమోషనల్ టచ్ బాగున్నాయి. సో ఆ కొన్ని అంశాలు పక్కన పెడితే ఈ చిత్రం ఓకే అనిపిస్తుంది.



## రేబిస్ టీకా తీసుకున్న రేణు దేశాయ్

నటి, నిర్మాత రేణు దేశాయ్ జంతు సంరక్షణ, వీధి కుక్కల సంక్షేమం పట్ల ఎంత శ్రద్ధ వహిస్తారో అందరికీ తెలిసిందే. అయితే తాజాగా ఆమె రేబిస్ టీకా తీసుకుంది. తాను టీకా తీసుకుంటున్న ప్రక్రియను వీడియో రికార్డ్ చేసి దానిని సోషల్ మీడియాలో పంచుకుంది. సాధారణంగా టీకాలు తీసుకున్నప్పుడు ఫోటోలు లేదా వీడియోలు రికార్డ్ చేయని రేణు దేశాయ్.. ఈసారి మాత్రం అవగాహన కల్పించే ఉద్దేశంతోనే ఇలా చేశానని తెలిపింది. నేను రేబిస్ టీకా తీసుకుంటున్నప్పుడు రికార్డ్ చేయడం ఇదే మొదటిసారి. గతంలో తీసుకున్నప్పుడు నేను ఫోటోలు లేదా వీడియోలు తీయాలని ఎప్పుడూ అనుకోలేదు. కానీ సమయానికి టీకా తీసుకోవడం ఎంత ముఖ్యమో తెలియజేయడానికి ఈసారి షేర్ చేయాలనిపించింది అని రేణు వెల్లడించింది.



## రష్యా నుంచి భారత్ ఇంధనం కొనుగోలు చేయదు

రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేయదు అని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి స్పష్టం చేశారు. ఇదే అంశాన్ని ఆయన గతంలోనూ పేర్కొన్న విషయం తెలిసిందే. భారత్ ఇప్పటికే వెనక్కి తగ్గిందని, రష్యా నుంచి ఆయిల్ కొనడాన్ని ఆపేసిందన్నారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీతో శుక్రవారం జరిగన భేటీ తర్వాత ట్రంప్ మీడియాతో మాట్లాడారు. ఆ సమయంలో కొన్ని కీలక వ్యాఖ్యలు చేవారు. రష్యా నుంచి భారత్ ఇంధనాన్ని కొనుగోలు చేయదని, ఆ నిర్ణయాన్ని వాళ్లు వెనక్కి తీసుకున్నారని, ఇప్పటికే రష్యా నుంచి 38 శాతం ఆయిల్‌ను భారత్ కొనుగోలు చేసిందని, ఇక భవిష్యత్తులో ఇంధన కొనుగోలు ఉండదని ట్రంప్ అన్నారు.

## మొబైల్ ఫోన్ల రికవరీలో.. దేశంలోనే తెలంగాణ టాప్ ప్లేస్‌లో

తెలంగాణ రాష్ట్రంలోని తపాలా, టెలికమ్యూనికేషన్స్ విభాగం, పోలీస్ శాఖల మధ్య సమన్వయం అద్భుతమైన ఫలితాలను సాధించింది. క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ శుక్రవారం వెల్లడించిన వివరాల ప్రకారం.. తెలంగాణ పోలీసులు 2025 అక్టోబర్ వరకు ఏకంగా 1.02 లక్షలకు పైగా పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన మొబైల్ ఫోన్లను రికవరీ చేయడంలో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. మొబైల్ ఫోన్ల దొంగతనం మరియు నకిలీ పరికరాల సమస్యలను అరికట్టడానికి డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ (DoT) ద్వారా సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ అభివృద్ధి చేశారు. తెలంగాణలో ఈ సీఈఐఆర్ వ్యవస్థను అమలు చేయడానికి సీఐడీ నోడల్ ఏజెన్సీగా పనిచేస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలోని 780 పోలీసు స్టేషన్లన్నింటిలో ఈ వ్యవస్థ కార్యాచరణలో ఉంది. ఈ పోర్టల్‌ను మొదటగా 2022 సెప్టెంబర్ 5న కర్ణాటక, మహారాష్ట్ర, ఢిల్లీ వంటి పైలట్ రాష్ట్రాలలో ప్రారంభించారు. తెలంగాణలో మాత్రం 2023 ఏప్రిల్ 19న (పైలట్ ప్రారంభం తర్వాత 226 రోజులకు) ప్రారంభించినప్పటికీ.. దొంగిలించబడిన లేదా పోగొట్టుకున్న మొబైల్ పరికరాల రికవరీలో దేశంలోనే అగ్రగామిగా నిలవడం ప్రశంసనీయం. సీఈఐఆర్ డాష్‌బోర్డ్ ప్రకారం.. 2025 అక్టోబర్ 16 వరకు తెలంగాణలో 1,00,020 మొబైల్ పరికరాలను రికవరీ చేసి.. దేశంలోనే అగ్రస్థానాన్ని దక్కించుకుంది. ఈ రికార్డు మొబైల్ పరికరాల పునరుద్ధరణలో జాతీయ స్థాయికి కొత్త ప్రమాణాన్ని సెట్ చేసింది. ఈ గొప్ప విజయం క్షేత్ర స్థాయిలో ఉన్న పోలీస్







అధికారుల నిబద్ధత, కృషి వల్ల సాధ్యమైందని సీఐడీ అదనపు డైరెక్టర్ జనరల్ చారు సిన్హా తెలిపారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా అందిన ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకోవడానికి ప్రతి పోలీస్ యూనిట్ క్రమం తప్పకుండా పనిచేసింది. ఇందులో కేసుల నమోదు, పోగొట్టుకున్న ఫోన్‌లను కలిగి ఉన్న వ్యక్తులను సంప్రదించడం, పరికరాలను తిరిగి పొందడం.. వాటిని నిజమైన యజమానులకు అప్పగించడం వంటి కార్యక్రమాలు ఉన్నాయి. తెలంగాణ పోలీసులు DoTతో కలిసి సీఈఐఆర్ పోర్టల్‌ను తెలంగాణ పోలీసు సిటిజన్ పోర్టల్‌తో ఏకీకృతం చేశారు. దీని వలన పౌరులు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను tspolice.gov.in ద్వారా లేదా ceir.gov.in ద్వారా నేరుగా నివేదించవచ్చు. సీఐడీ చీఫ్ ఈ విజయానికి DoT అధికారులు, సీఐడీ ఉద్యోగుల మధ్య ఉన్న సన్నిహిత సహకారాన్ని అభినందించారు.

## అదిరిపోయిన మానుషి

మానుషి చిల్లర్ ఈ అమ్మడు గురించి ఎంత చెప్పినా తక్కువే. అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంత. తన బ్యూటీ తో ఎంతో మంది మదిని దోచుకున్న ఈ చిన్నది వెండితెరపైకి ఎంట్రీ ఇచ్చి తన నటనతో అందరినీ ఆకట్టుకుంటుంది.బాలీవుడ్ సామ్రాట్ మూవీతో సిల్వర్ స్క్రీన్ పైకి ఎంట్రీ ఇచ్చింది. కానీ ఈ మూవీ హిట్ అందుకోలేదు. అయినా కూడా ఈ అమ్మడుకు వరసగా అవకాశాలు తలుపుతట్టాయి.దీంతో వచ్చిన ప్రతి అవకాశాన్ని మిస్ చేసుకోకుండా సినిమాలు చేస్తూ వస్తున్నప్పటికీ, ఈ బ్యూటీకి ఒక్క హిట్ కూడా పడలేదు. దీంతో ఈ అమ్మడు గ్రాఫ్ కొద్ది కొద్దిగా తగ్గిపోయింది.టాలీవుడ్ యంగ్ హీరో వరుణ్ తేజ్ సరసన ఆపరేషన్ వాలెంటైన్ సినిమాలో నటించి మెప్పించింది. కానీ ఈ మూవీ సైతం బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ అయ్యింది. దీంతో తెలుగులో అంతగా అవకాశాలు రాలేదు ఈ చిన్నదానికి.





## మజ్లిస్ పార్టీ పోటీ చేయడం లేదన్న అసదుద్దీన్ ఒవైసీ

జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి జరగనున్న ఉప ఎన్నికలో మజ్లిస్ పార్టీ పోటీ చేయడం లేదని ఆ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కీలక ప్రకటన చేశారు. బీజేపీని నిలువరించడానికి కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. నవంబర్ 11న జరిగే ఉప ఎన్నికకు నామినేషన్ దాఖలు చేయడానికి ముందు కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ శుక్రవారం ఒవైసీని కలిశారు. నవీన్ యాదవ్‌తో పాటు పార్టీ సీనియర్ నాయకుడు అజారుద్దీన్ కూడా ఉన్నారు. అజారుద్దీన్ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి ఓడిపోయారు.ఈ సందర్భంగా ఒవైసీ మాట్లాడుతూ, బీఆర్ఎస్ పదేళ్లు అధికారంలో ఉందని, ఈ కాలంలో జూబ్లీహిల్స్ నుంచి ఆ పార్టీకి చెందిన వారే ఎమ్మెల్యేగా ఉన్నారని, కానీ నియోజకవర్గం అభివృద్ధి చెందలేదని విమర్శించారు. నియోజకవర్గంలోని 3.98 లక్షల మంది ఓటర్లు ఇప్పుడు అభివృద్ధిని కోరుకుంటున్నారని అన్నారు. ఈ నియోజకవర్గంలో అనేక మురికివాడలు ఉన్నాయని, అన్ని వార్డులలో పౌర సౌకర్యాలు మెరుగుపరచాల్సిన అవసరం ఉందని అన్నారు.ఇప్పుడు వచ్చిన ఉప ఎన్నిక ఈ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి ఒక మంచి అవకాశంగా ఆయన అభిప్రాయపడ్డారు. 2023లో బీఆర్ఎస్ మాగంటి గోపీనాథ్‌కు టిక్కెట్ ఇవ్వకపోయి ఉంటే ఈ ఉప ఎన్నిక వచ్చి ఉండేది కాదని అన్నారు. గోపీనాథ్ అనారోగ్యంతో ఉన్నారనే విషయం 2023 నుంచి తెలుసని అన్నారు. నియోజకవర్గంలోని అన్ని వర్గాలను కలుపుకుని ముందుకు సాగాలని నవీన్ యాదవ్‌కు అసదుద్దీన్ సూచించారు.జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా మాగంటి సునీత పోటీ చేస్తుండగా, కాంగ్రెస్ నవీన్ యాదవ్‌కు టిక్కెట్ ఇచ్చింది. నవీన్ యాదవ్ గతంలో మజ్లిస్ పార్టీ నుంచి జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పోటీ చేశారు.కాగా, గత ఏడాది జరిగిన లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓట్లు బీజేపీకి బదిలీ అయినట్లు అసదుద్దీన్ ఒవైసీ భావిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్‌లో 37 శాతం ఓట్లు సాధించిన బీఆర్ఎస్ ఆ తర్వాత 5 నెలలకు జరిగిన లోక్ సభ ఎన్నికల్లో 15 శాతానికి పడిపోయిందని అసదుద్దీన్ గుర్తు చేశారు.నవీన్ యూదవ్ 2014 అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నుంచి మజ్లిస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి, మాగంటి గోపీనాథ్ చేతిలో ఓడిపోయారు. 2018లో నవీన్ యాదవ్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి మూడో స్థానానికి పరిమితమయ్యారు. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు నవీన్ యాదవ్ కాంగ్రెస్ పార్టీలో చేరినప్పటికీ, ఆ పార్టీ అజారుద్దీన్‌కు టిక్కెట్ కేటాయించింది.

సూర్య www.suryaa.com EVENING EDITION 4PM

# తెలంగాణ ఉద్యమం మాదిరిగా మరో బీసీ ఉద్యమాన్ని చేపడతాం



తెలంగాణ ఉద్యమం మాదిరిగా మరో బీసీ ఉద్యమాన్ని చేపడతామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. బీసీల బంద్‌కు మద్దతుగా ఆటోలతో ర్యాలీగా బయల్దేరి హైదరాబాద్ లోని ఖైరతాబాద్ చౌరస్తాలో మానవహారం నిర్వహించి మాట్లాడారు. గంటపాటు ఖైరతాబాద్ చౌరస్తాలో మానవహారం నిర్వహించి బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ బిడ్డలు తమకు రిజర్వేషన్లు కావాలని కోరుతున్నారని.. రిజర్వేషన్లు ఇచ్చే పార్టీలే బంద్ కు మద్దతు ప్రకటించటం నవ్వులాటగా ఉందని ఎద్దేవా చేశారు. దొంగ జీవోలు ఇచ్చిన కాంగ్రెస్, బీసీ బిల్లును పాస్ చేయించాల్సిన బీజేపీలు బంద్ కు మద్దతు పేరుతో డ్రామాలు చేస్తున్నాయని మండిపడ్డారు. హంతకులే వచ్చి నివాళులు అర్పించినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. బీసీ బిడ్డలను పదే పదే మోసం చేస్తున్నారని.. స్వాతంత్రం వచ్చిన నాటి నుంచి బీసీలను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ బీసీ బిడ్డల పంతం దేశానికి ఆదర్శంగా నిలవాలని అన్నారు. యూనైటెడ్ ఫూలే ఫ్రంట్ ఆధ్వర్యంలో జాగృతి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని.. బీసీ బంద్ ను విజయవంతం చేయాలని ప్రతి ఒక్కరినీ కోరుతున్నట్లు తెలిపారు.బీసీల రిజర్వేషన్లు అమలు చేసేలా టెక్నికల్ గా ప్రభుత్వాలు సరైన వాదనలు వినిపించటం లేదని కవిత విమర్శించారు. ఈ కారణంగానే బీసీలకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో తీర్పులు వస్తున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ రూల్స్ ప్రకారం జనగణన నిర్వహించలేదని చెప్పారు. జీవో 9 విషయంలో కూడా కాంగ్రెస్ కు చిత్తశుద్ధి లేదని.. అందుకే కోర్టు జీవో ను కొట్టేసిందని అన్నారు. బీసీల రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్, బీజేపీలకు చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. ఇప్పటికిప్పుడే ఎన్నికలు జరగాల్సినంత తొందర ఏముంది? అని ప్రశ్నించారు. మహారాష్ట్ర, తమిళనాడు లో 5 ఏళ్ల వరకు ఎన్నికలు జరగలేదని.. బీసీలకు రిజర్వేషన్ల అంశం తేలిన తర్వాత ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సర్పంచ్ లకు బిల్లులు ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ వారిని ఇబ్బంది పెడుతోందని ఫైర్ అయ్యారు. బీసీ రిజర్వేషన్లను అమలు చేయాల్సిన పార్టీలు చిత్తశుద్ధిగా పనిచేయాలని తాను డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు.



## రైలులో సీటు కోసం లొల్లి.. కోపంతో
# రైలులో బాంబ్ ఉందంటూ ఫిర్యాదు..

ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో సీటు కోసం జరిగిన గొడవ రైల్వేలో సంచలనం సృష్టించింది. రైలులో ప్రయాణిస్తున్న ఇద్దరు సోదరులు కంట్రోల్ రూమ్‌కు కాల్ చేసి..తమతో కోట్లాడిన వ్యక్తిని ఇబ్బందుల్లోకి నెట్టాలనే కోరికతో రైలులో బాంబు పెట్టినట్లు తప్పడు సమాచారం ఇచ్చారు. బాంబు అన్న మాటతో రైల్వే సిబ్బంది ఒక్కసారిగా ఉల్కిపడ్డారు. బాంబ్ హెచ్చరిక రైల్వే సిబ్బందిని ఉక్కిరిబిక్కిరి చేసింది. మొత్తం రైలును దాదాపు 45 నిమిషాల పాటు తనిఖీ చేశారు. ప్రతిదీ సాధారణంగా కనిపించింది. తర్వాత ఫోన్ చేసిన ఇద్దరు సోదరులను అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు ప్రారంభించారు. కాన్పూర్‌లోని ఘటంపూర్‌కు చెందిన ఇద్దరు సోదరులు 15708 ఆమ్రపాలి ఎక్స్‌ప్రెస్ (అమృత్‌సర్-కతిహార్)లో ప్రయాణిస్తున్నారు. కంపార్ట్‌మెంట్‌లోని సీటు విషయంలో ఇద్దరు అన్నదమ్ములతో కొంతమంది వాగ్వాదానికి దిగారు. దీనితో దీపక్ చౌహాన్ అనే వ్యక్తికి కోపం వచ్చి రైల్వే హెల్ప్‌లైన్ నంబర్ 139కి కాల్ చేసి రైలులో బాంబు అమర్చినట్లు సమాచారం ఇచ్చాడు. కంపార్ట్‌మెంట్ కిటికీ దగ్గర నల్లటి దుస్తులు ధరించిన ముగ్గురు వ్యక్తులు రైలులో టైమ్ బాంబును అమర్చారని.. అది ఎప్పుడైనా పేలిపోవచ్చని చౌహాన్ చెప్పారు.



## గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌లో భారీగా మంటలు..
# తప్పిన పెను ప్రమాదం

దీపావళి పండుగ వేళ దేశంలో ఘోర రైలు ప్రమాదం తప్పింది. పంజాబ్ రాష్ట్రంలో గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌లో భారీగా మంటలు చెలరేగాయి. లూథియానా నుంచి ఢిల్లీకి వెళ్తున్న అమృత్‌సర్-సహార్సా ఎక్స్‌ప్రెస్ రైలులో మంటలు వ్యాపించాయి. ఉదయం 7:30 గంటల ప్రాంతంలో ఈ సంఘటన జరిగింది. రైలు సిర్హింద్ స్టేషన్ దాటిన వెంటనే కోచ్ నంబర్ 19 నుండి పొగలు రావడం మొదలయ్యాయి. అప్రమత్తమైన ప్రయాణికులు అధికారులకు సమాచారం అందించారు. కాసేపటికే మంటలు రైలు కోచ్ మొత్తం వ్యాపించాయి. పెద్ద ఎత్తున ఎగసిపడ్డాయి. ఈ ఘటనతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.



## డిపోల్లోనే బస్సులు.. ఎక్కడికక్కడ నిరసనలు..
# కొనసాగుతున్న తెలంగాణ బంద్

తెలంగాణలో బీసీ సంఘాల బంద్ కొనసాగుతోంది. బీసీ రిజర్వేషన్లు ఆమోదించాలంటూ బీసీ సంఘాలు ఇచ్చిన బంద్ పిలుపుకు కాంగ్రెస్ సహా అన్ని పార్టీల మద్దతు తెలిపాయి. దీంతో బస్సులన్నీ డిపోలకే పరిమితమయ్యాయి. బస్ డిపోల ముందు బీసీ సంఘాలు, వివిధ పార్టీల నాయకులు నిరసకు దిగారు. ఇప్పటికే విద్యాసంస్థలకు యాజమాన్యాలు సెలవు ప్రకటించాయి. బంద్‌కు వ్యాపార, వాణిజ్య సంస్థలు కూడా మద్దతు తెలిపాయి. అయితే అత్యవసర సర్వీసులకు మాత్రం బంద్ నుంచి మినహాయింపు ఇచ్చారు. బంద్‌ను శాంతియుతంగా జరుపుకోవాలని పోలీసులు సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించొద్దని.. అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎమ్మెల్యేలు సైతం పలుచోట్లు నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో ఎదుటమాజీ మంత్రి జోగు రామన్న బైఠాయించారు. ప్రభుత్వాలు బీసీలను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. నిర్మల్ జిల్లా భైంసా డిపో ముందు బీసీ నాయకులతో పాటు వివిధ పార్టీల నాయకులు నిరసన తెలిపారు. అటు ఖమ్మంలోనూ బంద్ కొనసాగుతోంది. మరోవైపు ఎక్కడికక్కడ బస్సులు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పండగ సమయం కావడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా భావించిన ప్రైవేట్ వాహనదారులు అధిక ఛార్జీలు వసూల్ చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.అటు బీసీ సంఘాల జేఏసీ ప్రకటించిన బంద్‌కు బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు తెలిపింది. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌కు ఉదయం 8 గంటలకు బీఆర్ఎస్ నేతలు చేరుకున్నారు. తెలంగాణ భవన్ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లి బంద్‌లో పాల్గొన్నారు. మండల, జిల్లా స్థాయిలో బంద్‌లో పాల్గొనాలని పార్టీ కార్యకర్తలకు బీఆర్ఎస్ అధిష్ఠానం పిలుపునిచ్చిన విషయం తెలిసిందే.

# నీటి సంపులో పడి నాలుగేళ్ల బాలుడు మృతి

హైదరాబాద్‌లో తీవ్ర విషాదం నెలకొంది. గచ్చిబౌలిలో ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి నాలుగేళ్ల బాలుడు మృతి చెందాడు. గచ్చిబౌలి TNGO'S కాలనీలో వికారాబాద్ జిల్లా యాలల ప్రాంతానికి చెందిన బోయిని పరమేశ్వర్ నివాసం ఉంటున్నారు. గచ్చిబౌలి నానక్ రామ్ గూడాలోని ప్రభుత్వ పాఠశాలలో బోయిని పరమేశ్వర్ ఇద్దరు కుమారులు చదువుతున్నారు. ఇదే పాఠశాలలోని అంగన్వాడీలో చిన్న కుమారుడు నిఖిల్ తేజ్(4) చదువుతున్నారు. మధ్యాహ్నం సుమారు మూడు గంటల ప్రాంతంలో పిల్లలను ఇంటికి తీసుకురావడానికి ఆటో డ్రైవర్ ఇచ్చాడు. పాఠశాల వద్ద కేవలం ఒక కుమారుడు మాత్రమే ఉన్నాడని తండ్రి బోయిని పరమేశ్వర్ కు ఆటో డ్రైవర్ తెలిపాడు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు.. పాఠశాలకు చేరుకుని నిఖిల్ తేజ్ కోసం గాలించారు. పాఠశాల వెనుక వైపు ఉన్న నీటి సంపులో బాలుడు పడి ఉండటాన్ని గుర్తించారు. బాలుడు విగతజీవిగా పడి ఉండటాన్ని చూసి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ విషయమై గచ్చిబౌలి పోలీసులకు తండ్రి బోయిని పరమేశ్వర్ ఫిర్యాదు చేశారు. మృదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.ఈ ఘటనపై రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




# బీసీ బంద్.. దిల్‌సుఖ్‌నగర్‌లో ఉద్రిక్తత

42% రిజర్వేషన్ల కోసం రాష్ట్ర వ్యాప్తంగా బీసీ సంఘాలు బంద్ చేపట్టాయి. దిల్‌సుఖ్ నగర్‌లో బీసీ ప్రతినిధులు పెద్దఎత్తున పాల్గొని ఆర్టీసీ బస్ డిపోల ముందు బైఠాయించి నిరసన తెలిపారు. బీసీలకు 42% రిజర్వేషన్లు ఇవ్వాలంటూ నినాదాలు చేశారు. పలు ప్రైవేటు బస్సులను కూడా అడ్డుకోవడంతో పోలీసులు వారిని ఆపేందుకు ప్రయత్నించారు. పోలీసులు, బీసీ నేతల మధ్య వాగ్వాదం తలెత్తి పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.



## నా తదుపరి లక్ష్యం అఫ్ఘాన్-పాక్ మధ్య
# ఉద్రిక్తతలు ఆపడమే

అఫ్ఘానిస్థాన్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రతరమయ్యాయి. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిన పాకిస్థాన్.. శుక్రవారం అఫ్ఘాన్‌పై వైమానిక బాంబు దాడులు చేసింది. డ్యారాండ్ లైన్ వెంబడి అఫ్ఘాన్‌లోని పాక్టికా ప్రావిన్స్‌లోని పలు ప్రాంతాల్లో పాక్ వైమానిక దాడులకు పాల్పడింది. ఈ దాడిలో ముగ్గురు అఫ్ఘాన్ దేశవాళి క్రికెటర్లు సహా మొత్తం పది మంది మరణించారు. రెండు దేశాల మధ్య ఉద్రిక్తతల వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఘర్షణలను ఆపడం తనకు చాలా తేలికైన విషయం అని పేర్కొన్నారు. 'ఇప్పటికే ఎనిమిది యుద్ధాలు ఆపాను. నా తదుపరి లక్ష్యం పాక్-అఫ్ఘాన్ మధ్య శాంతికి మధ్యవర్తిత్వం వహించడమే. అఫ్గాన్‌పై పాక్ దాడి చేసిందనే విషయం నాకు అర్థమైంది. ఈ సంఘర్షణను పరిష్కరించాల్సి వస్తే.. అది నాకు చాలా సులభం. యుద్ధాలను ఆపడం అంటే నాకు చాలా ఇష్టం. రెండు దేశాల మధ్య సంఘర్షణలను ఆపడం నాకు చాలా తేలిక. ఇది నేను ఆపబోయే తొమ్మిదో యుద్ధం అవుతుంది. అయినా నాకు నోబెల్ శాంతి బహుమతి రావడం లేదు' అంటూ ట్రంప్ చెప్పకొచ్చారు. ప్రస్తుతం ఆయన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. ఈ నెల 14న తాలిబన్ సైనిక స్థావరాలపై పాక్ సైన్యం పెద్దఎత్తున దాడులకు పాల్పడింది. దీంతో తాలిబన్ సైన్యం కూడా ప్రతిదాడులకు దిగడంతో సరిహద్దుల్లో ఇరుదేశాల బలగాల మధ్య భీకర ఘర్షణలు చోటుచేసుకున్నాయి. అయితే 48 గంటల పాటు కాల్పుల విరమణ పాటించాలని రెండు దేశాలు నిర్ణయించడంతో దాడులు తాత్కాలికంగా నిలిచిపోయాయి. తాజాగా రెండ్రోజుల కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిన పాకిస్థాన్.. అఫ్ఘాన్‌పై మరోసారి దాడులకు దిగింది. డ్యారాండ్ లైన్ వెంబడి అఫ్ఘాన్‌లోని పాక్టికా ప్రావిన్స్‌లోని పలు ప్రాంతాల్లో పాక్ వైమానిక దాడులకు పాల్పడింది. దీంతో పది మంది మరణించారు. వారిలో ముగ్గురు అఫ్ఘాన్ దేశవాళి క్రికెటర్లు కూడా ఉన్నారు. మృతిచెందిన క్రికెటర్లను కబీర్, సిబాతుల్లా, హరూన్‌గా గుర్తించారు.



# డబ్బు కోసం యువకులను మోసం చేస్తున్న యువతి.. చివరికి?

యూపీలోని మథురకు చెందిన కాజల్ అనే యువతిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆమె ముఖ్యంగా ధనవంతులైన పెళ్లికాని యువకులను ప్రేమించి, పెళ్లి చేసుకుని, వారి ఇంట్లో ఉన్న నగలు, డబ్బు దోచుకుని పారిపోయేది. ఈ మోసాలకు కాజల్ తండ్రి భగత్ సింగ్, తల్లి సరోజ్ దేవి కూడా సహకరించేవారు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు. తాజాగా పట్టుబడిన కాజల్, 10 కంటే ఎక్కువ మందిని ఇదే విధంగా మోసం చేసినట్లు తెలుస్తోంది.




# నిజామాబాద్‌లో సీసీఎస్ కానిస్టేబుల్ హత్య.. డీజీపీ శివధర్ రెడ్డి సీరియస్

పరారీలో ఉన్న నిందితుడిని పట్టుకునేందుకు వెళ్లిన సీసీఎస్ కానిస్టేబుల్‌ను ఓ దొంగ కత్తితో పొడిచి చంపేశాడు. నిజామాబాద్‌లో జరిగిన ఈ ఘటనపై రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి సీరియస్ అయ్యారు. నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితులను పర్యవేక్షించాలని మల్టీజోన్-1 ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి ఆదేశించారు. మృతుని కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించాలన్నారు. వారికి అవసరమైన సహాయం చేయాలని సూచించారు. అంకిత భావంతో పనిచేస్తున్న కానిస్టేబుల్ ప్రమోద్ మరణం పట్ల విచారం వ్యక్తం చేశారు. చైన్‌స్నాచర్ రియాజ్‌పై నిజామాబాద్ సీసీఎస్‌కు సమాచారం వచ్చింది. దీంతో సీసీఎస్ ఎస్ఐ భీమ్‌రావు, కానిస్టేబుల్ ప్రమోద్(48) కలిసి బైక్‌పై బయల్దేరారు. ఖిల్లా ప్రాంతంలో అతడిని పట్టుకున్న పోలీసులు.. తనిఖీ చేయకుండానే ఠాణాకు తీసుకెళ్లేందుకు తమ బైక్‌పై ఎక్కించుకున్నారు. వినాయక్‌నగర్ వద్ద నిందితుడు కత్తి తీసి కానిస్టేబుల్ ప్రమోద్‌ను పొడిచి పరారయ్యాడు. దీంతో తీవ్రంగా గాయపడిన ప్రమోద్‌ను దవాఖానకు తరలించగా పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు తెలిపారు.